



అవినీతి అధికారులపై లోకాయుక్త దాడులు 5
రాయచూరు జడ్పీ అధికారి ఇంట్లో సోదాలు..

ఆదాయం పెంపే లక్ష్యం





బెంగళూరు నగర సమీపంలో లే అవుట్

- పంచాయతీలకు శక్తి నింపేలా 'బీ' ఖాతా
- పెరగనున్న వేలకోట్ల ఆదాయం
- రూ.90 లక్షల గ్రామీణ ఆస్తులపై ప్రభావం
- భారీగా పెరగనున్న విలువలు



పంచాయతీ కార్యాలయం

బెంగళూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణాలతో సమానంగా గ్రామాలు నేడు అభివృద్ధి చెందుతున్నాయి. అయితే పట్టణాల్లో వస్తున్నంత రెవెన్యూ ఆదాయం గ్రామాల్లో లభించడం లేదు. దీనికి ప్రధానం కారణం ఆ భూములు బీ ఖాతాల్లో లేకపోవడమే. అలాంటి పల్లెలకు సైతం ప్రభుత్వం ఆదాయం పెరిగే దిశగా చర్యలు తీసుకోనుంది. పట్టణాలు, నగరాలకు సమీపాన ఉన్న పలు గ్రామాలను బీ ఖాతాలో చేర్చనుంది. గ్రామాల్లో వ్యవసాయ ఆధారంపై దేశవ్యాప్తంగా 70శాతం మంది జీవనం సాగిస్తున్న తరహాలోనే రాష్ట్రంలోనూ అదే పరిస్థితి కొన సాగింది. అయితే ఇటీవల రెండు దశాబ్దాలుగా బెంగళూరు నగరం రెండునుంచి మూడింతలు విస్తీర్ణమైంది. ఇదే తరహాలోనే 25కుపైగా జిల్లా కేంద్రాలతోపాటు తాలూకా కేంద్రాలు సైతం అభివృద్ధి చెందాయి. పారిశ్రామికవాడలు జాతీయ, రాష్ట్ర రహదారులు ఏర్పడ్డంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ నివసించేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆదాయం పెరగడం అందుకు తగ్గట్టుగా నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు. ఒకప్పటి బెంగళూరుతో పోలిస్తే ప్రస్తుతం నగర నడిబొడ్డునుంచి ఆరేడువైపులా 40-50 కిలోమీటర్లకు పైగా విస్తరించింది. అందుకు తగ్గట్టుగానే మౌలిక సదుపాయాలు ఏర్పాటయ్యాయి. బెంగళూరు తర్వాత మైసూరు, రామనగర, మంగళూరు, ఉడుపి, బెళగావి, హుబ్బళ్ళి, ధారవాడ, బళ్ళారి, బాగల్కోట, బిజాపూర్ వంటి జిల్లా కేంద్రాల్లో గణనీయమైన ప్రగతి ఇటీవల ఒకటి రెండు దశాబ్దాలలోనే సాధ్యమైంది. అయితే గ్రామీణ ప్రాంతాలలో అనధికారిక నిర్మాణాలు, ప్రైవేట్ లే అవుట్‌లలో కట్టడాలు, ఇళ్లస్థలాల విలువ లక్షలు దాటిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో పన్ను తక్కువగా ఉండడంతో పంచాయతీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామికవాడలు, నగర ప్రాంతాలు ఇతరత్రా అభివృద్ధి చెందిన గ్రామాలు మినహా మిగిలిన అన్ని చోట్ల ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ అనేలా పంచాయతీలు కొనసాగుతున్నాయి. పంచాయతీల పరిధిలోని ఆస్తులకు పన్ను విధించే కొత్త ఆలోచనకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుతం బెంగళూరు నగర వ్యాప్తంగా ఈ-ఖాతాలు తప్పనిసరి చేస్తున్నారు. దీంతో ఆస్తుల క్రమబద్ధీకరణ, ఇతరత్రా లొసుగులు బయటపడి అధికారుల చుట్టూ ప్రజలు తిరుగుతున్నారు. అదే తరహాలో పల్లె ప్రాంతాల్లోనూ అభివృద్ధి చెందిన లేదా విలాసవంతమైన నిర్మాణాలు, లే అవుట్‌లు, ఇంటి స్థలాలకు బీ-ఖాతాలు తప్పనిసరి చేయాలని ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. అదే జరిగేతే వేల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం చేకూరనుంది. గ్రామీణ ప్రదేశాల్లో సుమారు 90 లక్షలకుపైగా పన్నుల రహితంగా ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీల పరిధిలో భూ పరివర్తన కాకుండా లే అవుట్‌లకు అనుమతులు లేకుండానే ఏర్పాటు చేసినవాటిని పన్నుల పరిధిలోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

అనధికార లే అవుట్లకు చెక్

బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ), నగర పాలికెలు, పంచాయతీల పరిధిలో భూ పరివర్తన కాకుండానే వ్యవసాయ భూములుగా రికార్డులలో ఉంటున్నా అనధికారికంగా లే అవుట్‌లు ఏర్పాటయ్యాయి. ఇలా భారీ స్థాయిలో లే అవుట్‌లు తలెత్తాయి. మారుమూల గ్రామాలు మినహాయిస్తే ఓ మోస్తరుగా అభివృద్ధి చెందిన పంచాయతీలు, జాతీయ, రాష్ట్ర రహదారులతోపాటు పరిశ్రమలు ఏర్పాటైన గ్రామీణ ప్రదేశాల్లో ప్రతి చోటా లే అవుట్‌లు ఏర్పాటయ్యాయి. భూ పరివర్తన కాకుండా నిబంధనలకు వ్యతిరేకంగా స్థిరాస్తుల కట్టడాలకు ఏ-ఖాతా లభించదు. అయితే తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు బీ-ఖాతాలకింద నమోదు చేసి ఆస్తిపన్నును సేకరించే ప్రయత్నం బృహత్ బెంగళూరు మహానగర పాలికె, ఇతర ప్రదేశాలలోనూ అమలు చేయదలిచారు.

మూడేళ్ల కిందటే ప్రస్తావన

బీజేపీ నేతృత్వంలోని బొమ్మై ప్రభుత్వంలోనే గ్రామీణ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు, లే అవుట్లను క్రమబద్ధీకరించి పన్నులు వసూలు చేయాలనే ప్రస్తావనలు వచ్చాయి. అప్పట్లో మంత్రి జేసీ మాధుస్వామి అధ్యక్షతన మంత్రివర్గ సబ్ కమిటీ అంశంపై సుదీర్ఘంగా కసరత్తు జరిపింది. అయితే అంతిమ నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, రెవెన్యూ ముఖ్య అధికారులతో మూడు నాలుగుసార్లు సమీక్షలు జరిపారు. పంచాయతీరాజ్‌శాఖకు అత్యవసరంగా పరిశీలన జరిపే అవకాశాన్ని కల్పించేందుకు రెవెన్యూశాఖ సిద్ధమైంది. అంతిమంగా పంచాయతీరాజ్‌శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

కట్టడాలకూ 'బీ' ఖాతా

గ్రామీణ ప్రదేశాల్లో అనధికార కట్టడాలకు నమూనా 11బీ ప్రకారం రిజిస్ట్రేషన్‌లకు అవకాశం ఉన్నా ఎక్కువమంది ఆస్తుల యజమానులు రిజిస్ట్రేషన్‌లకు ఉత్సాహం చూపలేదు. ఆస్తులు కల్గినవారు మాత్రమే కాకుండా పంచాయతీ పరిధిలో ప్రజాప్రతినిధులు సైతం ఇందుకు సుముఖంగా లేరు. ఇలా బీ-ఖాతా ద్వారానే పన్నుల వసూలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. గ్రామీణ ప్రదేశాల్లో లే అవుట్‌ల ఏర్పాటు లేదా మినీ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలతోపాటు విలాసవంతమైన ఇళ్లు నిర్మించుకున్నా పన్నులు తప్పనిసరి చేస్తే రాజకీయంగా వ్యతిరేకత వస్తుందనే గ్రామ సర్పంచ్‌లతోపాటు వార్డు మెంబర్లు వెనుకడుగు వేస్తారు. ఎక్కువ లే అవుట్‌లు ఇతరత్రా నిర్మాణాలలో బంధుమిత్రులే అధికంగా ఉంటారు.

మారనున్న పల్లె రూపురేఖలు

పంచాయతీరాజ్ పరిధిలో ఎటువంటి ఖాతాలు లేని ఆస్తులు 90 లక్షలకుపైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఆస్తులకు మౌలిక సదుపాయాలు సమకూర్చారు. కానీ పన్నులు రావడం లేదు. ప్రస్తుతం గ్రామీణ ప్రదేశాల్లో 34 లక్షల ఆస్తులు ఉన్నట్లు రికార్డులు ఉన్నాయి. వాటి ద్వారా రూ.863 కోట్ల ఆదాయం వస్తోంది. ఇక 90 లక్షల ఆస్తులకు పన్నులు విధిస్తే వేల కోట్ల రూపాయలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. వీటన్నింటినీ పన్నుల పరిధిలోకి తీసుకొస్తే గ్రామీణ ప్రదేశాల్లో అభివృద్ధితోపాటు నష్టాలబాటలోనే దశాబ్దాలుగా కొనసాగుతునన పల్లె సీమల రూపురేఖలు మారనున్నాయి.



ప్రారంభానికి సిద్ధమైన కనకదుర్గమ్మ వంతెన

ముహూర్తం కుదిరింది..!

- 9న కనకదుర్గమ్మ అండర్ పాస్ ప్రారంభించనున్న ఎమ్మెల్యే నారా

బళ్లారి సిటీ/రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని కనకదుర్గమ్మ గుడి సమీపంలోని రైల్వే అండర్ పాస్ ప్రారంభానికి ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. ఈ నెల 9న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. శుక్రవారం వంతెన పనులను పరిశీలించిన ఆయన పనులు పూర్తి కాకపోవడంతోనే వంతెన ప్రారంభించలేదన్నారు. అండర్‌పాస్ మధ్యలో రైల్వే ట్రాక్ ఉందని, ఆ భాగం పనులు ఆలస్యమవుతున్నాయని, దీనిపై రైల్వే శాఖ అధికారులకు సమాచారం అందించి పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని సూచించారు. విద్యుత్ దీపాల ఏర్పాటు మాత్రమే పెండింగ్‌లో ఉందని అధికారులు తెలిపారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకు ప్రజలు, సంస్థలు సహకరించాలని కోరారు.

ఆత్మహత్యలు వద్దు... అండగా ఉంటాం..!

- మైక్రోఫైనాన్స్ వేధింపులను అరికడతాం
- అన్నదాతలకు సీఎం సిద్దరామయ్య భరోసా



ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మైక్రోఫైనాన్స్ వారు వేధిస్తున్నారని భయపడి అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ప్రభుత్వం మీకు అండగా ఉందనేది ఎట్టి పరిస్థితిలోను మరువరాదని సీఎం సిద్దరామయ్య అన్నారు. రాష్ట్రంలో మైక్రోఫైనాన్స్ ఆగడాలను నియంత్రించేందుకే ఆర్డినెన్స్ తీసుకువచ్చామన్నారు. మైసూరులో జరుగుతున్న సుత్తూరు మఠం శివరాత్రీశ్వర శివయోగి జాతర ఉత్సవంలో శుక్రవారం సీఎం సిద్దరామయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సుత్తూరు మఠాధిపతి శివరాత్రీదేశీ కేంద్ర స్వామీజీ, తుమకూరు మఠాధిపతి సిద్ధలింగ స్వామీజీ, మంత్రులు మహదేవప్ప, హెచ్ కె పాటిల్‌లు సహా పలువురు ముఖ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ మైక్రోఫైనాన్స్ బాధితులకు విముక్తి లభించాలనే ఆర్డినెన్స్ తీసుకువచ్చామన్నారు. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా వేధింపులు తగ్గుతాయన్నారు. సమాజంలో ఆర్థిక సామాజికత లభించినప్పుడు మాత్రమే కుల వ్యవస్థ అంతం కానుందన్నారు. ప్రభుత్వం ద్వారా అమలు చేసే గ్యారెంటీలు పేద మధ్యమ వర్గాల ఆర్థికతకు చేదోడుగా ఉందన్నారు. పేదవర్గాల అవసరాలను అవకాశంగా తీసుకుని మైక్రోఫైనాన్స్‌లు అప్పులు ఇస్తున్నాయన్నారు. సెక్యులరిజం అమలు చేయడం రాజ్యాంగ మూల ఉద్దేశమన్నారు. 12వ శతాబ్దంలోనే బసవణ్ణ సమాజంలో అందరూ సమానమనేలా చాటారన్నారు. బసవణ్ణ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కులాలు, మతాల పేరుతో విభేదించి జీవించరాదన్నారు. విద్యావంతులూ కర్మ సిద్ధాంతాన్ని పాటించాలన్నారు. మూఢనమ్మకాలను పారదోలేలా యువ విద్యార్థులు వ్యవహరించాలన్నారు. సుత్తూరు మఠం అన్నదాసోహ ద్వారా ఎంతోమంది ఆకలి తీర్చిందని విద్యావంతులుగా తీరుస్తోందన్నారు.



విద్యార్థులను అభినందిస్తూ..



సిద్దాపురలో అలంకరణలో వాసవీమాత

వాసవాంబకు.. వందనం..!

- భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినం
- భక్తులతో ఆలయాలు కిటకిట

ఉత్తర తాలూకాలో చిరుత సంచారం

- అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారుల హెచ్చరిక

5



సీసీటీవీలో రికార్డయిన చిరుత



కృష్ణగిరి కలెక్టర్‌గా దినేష్‌కుమార్

పెరంబూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్, తిరువణ్ణామలై, కృష్ణగిరి, విల్లుపురం సహా 9 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న సరయూను బదిలీ చేసి ఆ స్థానంలో దినేష్ కుమార్‌ను నియమిస్తూ తమిళనాడు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆంధ్రా రుచులకు పెట్టింది పేరు నందన

- 26వ శాఖ ప్రారంభోత్సవంలో నటి తారా అనురాధ

మహదేవపుర, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా రుచులకు నందన హోటల్స్ పెట్టింది పేరని ప్రముఖ నటి తారా అనురాధ పేర్కొన్నారు. వైట్‌ఫీల్డ్ కాడగోడిలో శుక్రవారం 26వ నందన శాఖను చిత్తూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గురజాల జగన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా నందన హోటల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆంధ్రా రుచుల్లో ప్రత్యేకించి మాంసాహార వంటకాలకు ఆదరణ కలిగి ఉందన్నారు. నగరంలో హోటల్‌కు వెళ్ళాలంటే నందనాకు తన ప్రాధాన్యం అన్నారు. నటి తారా అనురాధ మాట్లాడుతూ ఎంతో కాలంగా నందన గ్రూప్ హోటల్స్‌లో అనుబంధం ఉందని నాణ్యత విషయంలో రాజీ లేకుండా వంటకాలు ఉంటాయన్నారు. ఇక్కడి వంటకాలను అన్ని ప్రాంతాల వారు ఆదరిస్తారన్నారు. నందనప్యాలెస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ రవిచందర్ మాట్లాడుతూ 1989 నుంచి హోటల్ వ్యాపారంలో ఉన్నట్లు తెలిపారు. నగర వ్యాప్తంగా 26వ శాఖను తెరువడం సంతోషంగా ఉందన్నారు. వినియోగదారుల నమ్మకాలకు అనుగుణంగా వంటల తయారీ మా ఆశయమన్నారు. బిర్యానీతో పాటు వివిధ రోస్టెడ్ రుచులు తమ ప్రత్యేకమన్నారు. నగర వ్యాప్తంగా శాఖల ద్వారా ఒకే విధమైన రుచులు అందిస్తామన్నారు. బెంగళూరు అంటే దేశ, విదేశీ ప్రజలు ఇష్టపడే నగరమని అందుకే అందరూ ఇష్టపడే వంటకాలు అందిస్తున్నామన్నారు. ఆక్స్‌ఫర్డ్ గ్రూపు విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎస్ఎన్‌వీఎల్ నరసింహరాజు, సంగీత మొబైల్స్ డైరెక్టర్ చంద్రధర్, జెకే గ్రూపు ఛైర్మన్ జయరాం, కేఎస్‌హెచ్‌ఏ ఛైర్మన్ జీకే శెట్టి, అడియార్ ఆనందభవన్ మేనేజింగ్ డైరెక్టర్ వి. విష్ణుశంకర్, హోటళ్ళ సంఘం అధ్యక్షులు పీసీ రావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



నందన హోటల్‌శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్, నటి తారా అనురాధ

అందరిచూపు నిర్మలమ్మ వైపే..!



- కేంద్ర బడ్జెట్ కోసం ఎదురు చూపులు
- రూ.11,495 కోట్లు కోరిన రాష్ట్ర ప్రభుత్వం

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అందరి చూపు నిర్మలమ్మ నిర్ణయాల కోసం ఎదురు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందని తరచూ విమర్శలు చేస్తూనే ఎక్కువ గ్రాంట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వ సారథులు వేచి చూస్తున్నారు. ప్రత్యేకించి రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్ళే లక్షల కోట్లలో వాటా రూపంలో అన్యాయం జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. వాటా శాతం పెంచడంతో పాటు రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రోత్సాహంగా నిధులు బడ్జెట్‌లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక గ్రాంట్ల కోసం రెండురోజుల కిందటే సీఎం సిద్దరామయ్య ప్రత్యేకంగా లేఖ రాయగా డీసీఎం డీకే శివకుమార్ కూడా గ్రాంట్లు మంజూరును కోరారు. తాజాగా రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి కృష్ణబైరేగౌడ ప్రత్యేకంగా కేంద్ర ఆర్థిక మంత్రికి విన్నవించారు. రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన కళ్యాణకర్ణాటక(ఒకప్పటి హైదరాబాద్ కర్ణాటకగా) పిలువబడే జిల్లాల అభివృద్ధికి నిధులు కోరారు. కావేరి నదికి అనుబంధంగా కనకపుర పరిధిలో నిర్మించిదలచిన మేకెదాటు ప్రాజెక్టును బడ్జెట్‌లో ప్రవేశపెట్టాలని కోరారు. 15 ఆర్థిక కమిషన్ సిఫారసు చేసిన ప్రత్యేక గ్రాంట్ రూ.,11495 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఇటీవలే ఢిల్లీకి వెళ్ళి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ ఇచ్చి సమగ్రంగా అన్ని అంశాలను వివరించినట్లు రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ శుక్రవారం బెంగళూరులో మీడియాకు తెలిపారు. రాష్ట్రానికి అదనపు గ్రాంట్లు కోరడంతో పాటు రెండేళ్ళ కిందటి బడ్జెట్‌లో ఎగువభద్ర ప్రాజెక్టుకు ప్రకటించిన గ్రాంట్ విడుదల కాలేదని వెంటనే విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు పనులు ముగిశాక చెల్లింపుల కంటే ముందుగా గ్రాంట్లు విడుదల చేయాలని కోరామన్నారు. ఆశా కార్యకర్తలకు గౌరవధనంగా నెలసరి ఐదువేలతో పాటు కార్యకర్తలకు ఇచ్చే రెండువేల గ్రాంట్‌ను పెంచాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ పథకం సహాయ ధనాన్ని ఒకటిన్నర లక్షల నుంచి ఐదు లక్షలకు గ్రామీణ ప్రాంతాల ఇళ్ళకు అందించే సాయం రూ.72వేల నుంచి మూడులక్షలకు పెంచాలని కోరినట్లు తెలిపారు. కాగా మరికొన్ని గంటలలోనే కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్న తరుణంలో ఎవరికి వరాలు ఎవరికి భారం అనే అంశంపైనా సుదీర్ఘ చర్చలు సాగుతున్నాయి. ముఖ్యంగా బంగారం ధరలపై పలు రకాల వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. ప్రత్యేకించి వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఆశగా నిర్మలమ్మ నిర్ణయాల కోసం ఎదురు చూస్తున్నారు.



రేపటి ఉదయమై వస్తా..!



తూరుపు దిక్కున
ఉదయించినది మొదలు
విసుగు చెందక, విరామమెరుగక
జగతికి వెచ్చని వెలుగులు
పంచిన భానుడు..
రణ క్షేత్రంలో భీకరంగా పోరాడి,
రుధిర ధారలు పులుముకున్న వీరుడిలా
అరుణవర్ణంతో శోభిల్లితూ...అలసి, సొలసి
ప్రకృతి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ
విశ్రాంతి కోసం పడమటి దిక్కుకు పయనించే వేళ
గంగమ్మ ఎర్రనీళ్లతో దిష్టి తీస్తోంది.

చిత్రమైన సృష్టిలో ప్రకృతి గీసిన ఈ చిత్రాలను అనంతపురం నగర శివారు పండమేరు వద్ద శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.



నిధులు ఇస్తాం.. ప్రణాళిక సిద్ధం చేయండి

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ

అనంతపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రికి ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నామని, వాటితో ఆస్పత్రిలో పనులు చేయడానికి తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఇంజనీర్లకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. పెన్నార్‌భవన్‌లో ఉన్న జిల్లాప్రణాళిక కార్యాలయంలో ఎంపీ ల్యాండ్స్‌తో పనులు-నిధుల ఖర్చు తదితర వాటిపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో ఎంపీ ల్యాండ్స్, ఉపాధి నిధులను ప్రజలకు ఉపయోగపడే పనులకే ఉపయోగించాలన్నారు. అలాంటి పనులు ఏమైనా ఉంటే గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే వాటికి నిధులు వచ్చేటట్లు చేస్తానన్నారు. మంజూరైన నిధులతో ఆపనులను సకాలంలో పూర్తిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఇంజనీర్లకు సూచించారు. సీపీఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. పనులు పూర్తికాగానే బిల్లులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి పంపాలని ఇంజనీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, డ్వామా, డీఆర్‌డీఏ, మునిసిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకోండి

● అనంతపురం ఈఎస్

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కల్లు గీత కార్మికులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. జిల్లాలో 14 మద్యం షాపులను కల్లుగీత కార్మికులైన ఈడిగ, గౌడ్, గౌడ, గౌండ్ల, కళాలి కులస్థులకు కేటాయించినట్లు తెలిపారు. ఈడిగకు 9, గౌడ్‌కు 2, గౌడ, గౌండ్ల, కళాలి కులస్థులకు ఒక్కొక్కటి చొప్పున దుకాణాలు కేటాయించామన్నారు. ఈడిగ కులస్థులు గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలు, కంబదూరు, గుమ్మఘట్ట, గుంతకల్లు రూరల్, రాప్తాడు, బెళుగుప్ప మండలాల్లో దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌడ్ కులస్థులు అనంతపురం నగర పాలక సంస్థ, గుత్తి రూరల్ మండలంలోని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌడ రాయదుర్గం రూరల్, గౌండ్ల కులస్థులు డి.హీరేహాళ్, కళాలి కులస్థులు తాడిపత్రి మున్సిపాలిటీలోని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ఎక్సైజ్ పోలీసు స్టేషన్లల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించినట్లు వివరించారు.

రేపు జీవజంత్ కళ్యాణ్ దివస్

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆదివారం జీవజంత్ కళ్యాణ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా ప్రాంతీయ పశు వైద్యశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి కొత్త విలువ

జిల్లాలో భూముల మార్కెట్ విలువ పెంపు

10 నుంచి 20 శాతం వరకూ..

గతేడాది పెంచని ప్రభుత్వం

రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయంపై ఆశలు



అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ల కోసం వేచివున్న క్రయ, విక్రయదారులు

అనంతపురం క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంపునకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో ప్రతి ఏటా ఆగస్టు సమయంలో భూముల విలువ పెంచుతూ ఉంటారు. గత ఏడాది కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై కసరత్తు చేసినా పలు కారణాలతో ఈ ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా మార్కెట్ ధరలకు అనుగుణంగా భూముల విలువను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో భూముల విలువ 10 నుంచి 20శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో పోలిస్తే 2019లో ఒకసారి భూముల ధరలు పెరిగాయి. ఆ తరువాత కరోనా కారణంగా మూడేళ్ల భూముల విలువల్లో మార్పు చేయలేదు. కానీ 2023లో భూముల విలువ భారీగా పెరిగింది. గత ఏడాది పెరగలేదు. దీంతో కొనుగోలుదారులపై భారం పడనుంది.

ఎక్కడెక్కడ.. ఎలాగంటే..?

జిల్లా వ్యాప్తంగా భూముల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరగనున్నాయి. జిల్లా కేంద్రమైన అనంతపురం కార్పొరేషన్‌తో పాటు పలు పట్టణాల్లో అత్యధికంగా 15 నుంచి 20శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. అనంతపురం చుట్టుపక్కల భూములు అత్యధిక ధరలు పలుకుతున్నాయి. అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో నారాయణపురంలో గజం ప్రస్తుతం రూ.5వేలు ఉండగా పెరిగిన ధరలతో రూ.6వేలుగా నిర్ణయించారు. కురుగుంట రూ.3600లు ఉండగా రూ.4వేలకు పెంచారు. రాచానపల్లిలో రూ.4వేల నుంచి రూ.5వేలకు, పాములాయిలో రూ.5వేల నుంచి రూ.6వేలకు పెంచారు. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని కక్కలపల్లి, రుద్రంపేట ప్రాంతంలో గజం రూ.6వేలు ఉండగా రూ.7వేలకు పెంచారు. ఆలమూరు, కట్టకిందపల్లిలో రూ.2500ల నుంచి రూ.2800ల వరకు పెంచారు. మన్నీల, చియ్యేడు, పూలకుంటలో రూ.700లు ఉండగా రూ.900లకు పెంచారు. కొడిమి, నరసనాయనికుంటలో రూ.1100ల నుంచి రూ.1400వరకు పెరగను న్నాయి. మేజర్ పంచాయతీ రాప్తాడుతో పాటు యర్రగుంట్ల, బొమ్మేపర్తి, బండమీదపల్లి ప్రాంతాల్లో గజం రూ.550ల నుంచి రూ.700లకు పెరుగనుంది. మరూరు, గొల్లపల్లి, చెర్లోపల్లి ప్రాంతంలో గజం రూ. 1100ల నుంచి రూ.1400వరకు పెరుగుతా యి. ఆత్మకూరు మండలంలో ఆత్మకూరు, పంపనూరులలో (రెసిడెన్షియల్, కమర్షియల్) ప్రాంతాలకు రూ.2వేల నుంచి రూ.2200 వరకు పెరగనున్నా యి. పి.యాలేరు, మదిగుబ్బ తదితర ప్రాం తాల్లో రూ.550ల నుంచి రూ.700ల వరకు పెరుగుతాయి. కూడేరు మండల కేంద్రంలో గజం రూ. 1100ల నుంచి రూ.1500ల వరకు, గొట్టుకూరులో రూ.2500ల నుంచి రూ.2800లవరకు చోళసముద్రం తదితర ప్రాంతాల్లో రూ.550ల నుంచి రూ.700వరకు పెరుగుతుంది. గార్లదిన్నె మండలం మర్తాడులో రూ.700ల నుంచి రూ.800ల వరకు, పెనకచెర్ల డ్యామ్ లో రూ.550ల నుంచి రూ.700ల వరకు పెరుగుతాయి. బుక్కరాయసముద్రం మండలంలోని గోవిందంపల్లిలో రూ.1800ల నుంచి రూ.2వేల వరకు, పొడరాళ్ల, రేగడికొత్తూరులలో రూ.2వేల నుంచి రూ.2200వరకు పెరుగుతాయి. గుంతకల్లు నియోజకవర్గంలోని కసాపురంలో గజం రూ. 1500 నుంచి 1700వరకు ఉంటుంది. కళ్యాణదుర్గం, రాయదుర్గం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో గజం రూ.1700ల నుంచి రూ.1900ల వరకు, రూ.2వేల రూ.2100వరకు పెరిగాయి.

పట్టణ ప్రాంతాల్లో

గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణాల్లో 10 నుంచి 20 శాతం మాత్రమే పెరగను న్నాయి. ఎక్కువగా 15శాతానికే పరిమితం కానున్నాయి. అనంతపురం నగరంలోని వినాయక్‌నగర్‌లో గజం రూ.18వేలుండగా రూ.19వేలకు పెరగనుంది. ఇక కమలానగర్ లాంటి కమర్షియల్ ప్రాంతాల్లో అయితే గజం రూ.40వేలుండగా రూ.42వేలకు పెరగనుంది. గుంతకల్లు పట్టణంలో గజం రూ.3500ల నుంచి రూ.4000వరకు పెరుగుతుంది. కమర్షియల్ ప్రాంతాల్లో మరో రూ.వెయ్యి పెరగనుంది. గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో 5 నుంచి 18.5శాతం వరకు భూముల ధరలు పెరగనున్నట్లు సంబంధిత రిజిస్ట్రార్లు చెబుతున్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలో ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ధరలు ఉండనున్నాయి. అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్‌లు రూ.1400లు ఉండగా రూ.1490లకు పెరగనుంది. ప్రతి అదనపు ఫ్లోర్‌కు రూ.30ల వరకు పెరుగుతుంది. కమర్షియల్ ప్రాంతాల్లో భవనాలకు సంబంధించి గ్రౌండ్‌ఫ్లోర్‌కు రూ.1800లు, ఫస్ట్ ఫ్లోర్‌కు రూ.1700, సెకండ్ ఫ్లోర్‌కు రూ.1590, సెల్లార్, స్టిల్ట్, పార్కింగ్ ప్లేస్‌కు రూ.1060ల వరకు పెరిగిన ధరలుగా నిర్ణయించారు.

ఆదాయం పెరుగుతుందా...?

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు గత కొంతకాలంగా ఆదాయం తగ్గిందనడంలో ఎలాంటి సందేహం లేదు. 2023లో ఒకే సారి భూముల ధరలు అమాంతం పెరగడంతో రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం పెరిగాయి. రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడం లాంటి కారణాలతో భూముల రిజిస్ట్రేషన్లు తగ్గాయి. గత ఏడాది భూముల విలువలు పెరగలేదు. ఇప్పుడు కూడా 10నుంచి 15శాతం వరకే అధికంగా పెరగనున్నాయి. గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో తగినంత ఆదాయం రాలేదని రికార్డులు చెబుతున్నాయి. దీనికి తోడు అనంతపురం, అనంతపురం రూరల్ వంటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గతంలో రోజుకు 80 నుంచి 110వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ కొన్ని నెలల పాటు రోజుకు కేవలం 30 నుంచి 40 డాక్యుమెంట్లకే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ సారి ఆదాయం పెరుగుతుందనే భావిస్తున్నారు.

వ్యవసాయ భూములు ఇలా..

జిల్లాలోని వ్యవసాయ భూములు ఎకరాల వారిగా పెంపుదల కానుంది. ఉదాహరణకు కామారుపల్లి పంచాయతీ పరిధిలో డ్రై/వెట్/గార్డెన్ ఎకరా రూ.1.60లక్షలుండగా రూ.2.50లక్షలకు పెంచారు. అగ్రికల్చర్ ల్యాండ్ ఫిట్ ఫర్ హెచ్‌ఎస్ కింద రూ.3లక్షలుండగా రూ.6లక్షలకు పెంచారు. ఎన్‌హెచ్, స్టేట్ హైవే రోడ్ల పక్కనున్న వాటికి ఎకరా రూ.2.70లక్షలుండగా రూ.6లక్షలవరకు పెంచారు. హౌస్ సైట్స్ ఉన్న భూములు ఎకరా రూ.26.62లక్షలుండగా రూ.33.88లక్షలుగా పెంచారు. అదే కక్కలపల్లి పంచాయతీ పరిధిలో డ్రై/వెట్/గార్డెన్ కింద ఎకరా రూ.20లక్షలుండగా రూ.22లక్షల వరకు పెంచారు. ఎన్‌హెచ్, స్టేట్ హైవే రోడ్ల పక్కన ఎకరా రూ.82లక్షలుండగా రూ.90లక్షలకు పెంచారు. ఇలా పట్టణ ప్రాంతాలకు సమీపంలోని వ్యవసాయ భూముల కు, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు, హైవేల పక్కన ఉన్న భూములకు ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.



పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నేతలు

ఫీజు పోరును జయప్రదం చేయండి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం క్రైం,జనవరి31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అండగా ఈనెల ఐదున వైసీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఫీజు పోరును విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలవుతున్నా ఒక్క రూపాయి చెల్లించలేదన్నారు. తాజాగా ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. రూ.3900కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐదో తేదీ ఉదయం 10.30గంటలకు జడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం ఉదయం ఆరు గంటలకే ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారని తెలిపారు. జిల్లాలో 2,82,754 మంది పింఛన్‌దారులకు రూ.124.90 కోట్లు మంజూరైంది.

ఇన్‌చార్జ్ డీడీగా వెంకటేశ్వర్లు

అనంతపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టరుగా కడప జిల్లా డీడీ వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ డీడీ సరళ విజయకుమారి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో కడప డీడీకి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఖజానాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమగ్రశిక్ష వార్షిక బడ్జెట్‌పై చర్చ

అనంతపురం విద్య, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర ప్రాజెక్టు 2025-26 వార్షిక బడ్జెట్(ఏడబ్ల్యూపీ అండ్ బడ్జెట్) ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు మొదలెట్టారు. ఈక్రమంలోనే ఏపీసీ శైలజ సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులతో శుక్రవారం స మావేశం నిర్వహించారు. 2025-26 వార్షిక బడ్జెట్ కు అన్ని విభాగాల నుంచి సమగ్ర వివరాలను సేకరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సివిల్ వర్కులు, ఫైనాన్స్, అకడమిక్ మానిటరింగ్ విభాగం (ఏఎంఓ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ విభాగం(జీసీడీఓ) ప్లానింగ్, అలెస్కో, ఐఈడీ, ఇంజనీరింగ్, ఎస్టాబ్లిష్ తదితర విభాగాల నుంచి వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు క్షుణ్ణంగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ చంద్రశేఖర్‌రెడ్డి, వాణీదేవి, గోపాలకృష్ణ, నారాయణస్వామి, గురుమణికృష్ణ, సూపరింటెండెంట్ ఇక్బాల్ పాల్గొన్నారు.

5న అనంత ఉద్యాన సమ్మేళనం

అనంతపురం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఫిబ్రవరి ఐదో తేదీన అనంత ఉద్యాన సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సమ్మేళనంలో జాతీయ, అంతర్జాయ స్థాయి కంపెనీల ప్రతినిధులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారులు పాల్గొంటారు. ఉమ్మడి జిల్లాతోపాటు రాయలసీమలోని ఇతర జిల్లాల నుంచి ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. అరటి, చీనీ, మిరప, టమోటా, మామిడి పంటల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకే ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇదివరకు శుక్రవారం ఈ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించారు. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో ఫిబ్రవరి ఐదో తేదీకి వాయిదా వేశారు.

ఆశలు.. తీరేనా..?

కొత్త, రద్దు చేసిన రైళ్లు పట్టాలెక్కేనా?

నేటి కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులెన్నో..!

విజయవాడకు కొత్త రైళ్లపై ప్రయాణికుల ఆశలు



నిర్మాణంలో ఉన్న గుంతకల్లు విద్యుత్ లోకో షెడ్

గుంతకల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లో రైల్వేకు ఏమేరకు కేటాయింపులు జరుగుతాయోనని రైల్వే ఉద్యోగులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. రైల్వే ప్రత్యేక బడ్జెట్‌ను రద్దుచేసి, కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేసి తొమ్మిదేళ్ళ పూర్తవుతోంది. అప్పటి నుంచీ ప్రతి ఏటా బడ్జెట్ ప్రసంగంలో రైల్వేల ప్రస్తావన తగ్గుతూ వస్తోంది. రైల్వేలకు గంపగుత్తగా నిధులను ఇవ్వడం, వందే భారత్ రైళ్లను ప్రకటించిమమ అనిపించడం ఆనవాయితీగా మారింది. తర్వాత విడుదల చేసే పింక్ బుక్‌లో వందే భారత్ రైళ్లు కాకుండా ప్రజావసరాల మేరకు డిమాండు ఉన్న రైళ్ల ప్రసక్తి ఉండటంలేదు. కాగా రాష్ట్రానికి కొత్త రైల్వే జోన్ రానున్న నేపథ్యంలో రాయలసీమ జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి కొత్త రైళ్లు ప్రకటించాలన్న డిమాండ్ పెరిగింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటైతే గుంతకల్లు రెండో అతి పెద్ద డివిజన్‌గా అవతరిస్తుంది. ఈ మేరకు గుంతకల్లు-విజయవాడ-విశాఖపట్నం మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. దీంతో ఈ మార్గంలో కొత్త రైళ్ల ఆవశ్యకత ఏర్పడుతుంది. ఆ మేరకు ఈ బడ్జెట్‌లో కొత్త రైళ్లు ఏవైనా కేటాయిస్తారా? అన్న ఆసక్తి నెలకొని ఉంది.

రైళ్లు వచ్చేనా?

గుంతకల్లు రైల్వే డివిజన్ నుంచి గడచిన నాలుగేళ్లుగా కొత్త రైళ్లు, రద్దయిన పాత రైళ్లను నడపాలన్న డిమాండ్లు ఉన్నాయి. రైల్వే డివిజన్‌లో గతంలో నడచిన యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరు, హుబ్లీ-విజయవాడ, కర్నూలు-గుంతకల్లు ప్యాసింజరు, బళ్లారి-గుంతకల్లు ప్యాసింజరు, రాయచూరు-గుంతకల్లు రైళ్లను కరోనా సమయంలో రద్దు చేసి పునరుద్ధరించలేదు. అలాగే కొల్హాపూర్-మణుగూరు ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. కిందటి నెలలో ఈ రూటులో ఓ ప్రత్యేక రైలును నడిపి తర్వాత రద్దు చేశారు. ముంబై-చెన్నై (16511/12) ఎక్స్‌ప్రెస్, ముంబై-చెన్నై మెయిల్ (నం. 17008/09) ఎక్స్‌ప్రెస్, హుబ్లీ-విజయవాడ రైళ్లను పునరుద్ధరించాల్సిన అవసరముంది. 2008లో గుంతకల్లు-కల్లూరు లైన్ గేజ్ కన్వర్షన్ సమయంలో గుంతకల్లు-ధర్మవరం ఫాస్ట్ ప్యాసింజరు రైలును రద్దు చేశారు. 2010లో కల్లూరు లైన్ పునఃప్రారంభం తర్వాత ఫాస్ట్ ప్యాసింజరును పునరుద్ధరించలేదు. ఈ రైలును మరలా నడపాలని పదిహేనేళ్లుగా స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గుంతకల్లు నుంచి విజయవాడకు వెళ్లడానికి అమరావతి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లు మినహా తగిన రైళ్లు లేవు. కనుక రాష్ట్ర రాజధానికి కొత్త రైళ్లు రావాలని కోరుతున్నారు.

నిధులు ఏ మేరకో...

హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టడం, సరుకు రవాణా వేగవంతంగా జరిగేలా చేసే లక్ష్యంతో ఈ బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన రైలు మార్గాలలో డబ్లింగ్ పూర్తిచేయడం, ట్రాక్ రీప్లేస్మెంట్, సరుకు రవాణా కోసం ట్రిపుల్, క్వాడ్రాపుల్ లైన్లకు అగ్రతాంబూలమిచ్చేలా కనిపిస్తోంది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రైళ్లను 130 కిమీల వేగంతో నడపడానికి నిర్ణయించి, రైల్వే లైన్లు సక్రమంగా లేని కార ణంగా ఆ ప్రయత్నాన్ని విరమించారు. ఈ బడ్జెట్‌లో డివిజన్‌కు లైన్ల పునరుద్ధరణకు ఎక్కువ నిధులు లభించే అవకాశాలున్నాయి. గుంతకల్లులో పుష్కర కాలం నుంచీ నిర్మాణంలో ఉన్న ఎలెక్ట్రిక్ ట్రాక్షన్ షెడ్డు పూర్తి కావడం లేదు. అతి తక్కువగా నిధుల కేటాయింపు జరుగుతుండటంతో పనులు నత్తనడకన జరుగుతున్నాయి. షెడ్ నిర్మాణం పూర్తికి నిధుల కేటాయింపు జరగాల్సి ఉంది. గుత్తి-పెండేకల్లు, ధర్మవరం-పాకాల లైన్ డబ్లింగ్ కోసం నిధులు లభించే అవకాశాలున్నాయి. నిర్మాణం అంతిమ దశకు చేరిన గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ ప్రాజెక్టుకు, కడప-బెంగళూరు, శ్రీకాళహస్తి-నడికుడి లైన్ల నిర్మాణ ప్రాజెక్టులకు నిధులు విడుదలయ్యే పరిస్థితి ఉంది. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోని 1, 2-3 ప్లాట్‌ఫాంలను విజయవాడ, చెన్నై లైన్లకు అనుసంధానం చేయడానికి గత బడ్జెట్‌లో అనుమతి ఇచ్చారు. నిధులు విడుదలకాక పనులు ప్రారంభం కాలేదు. ఆ పనులకు నిధులు లభించాల్సి ఉంది.



వివిధ రూట్లతో అనుసంధానించాల్సి ఉన్న 1, 2-3 ప్లాట్‌ఫారాల లైన్లు

రైల్వే ఉద్యోగుల ఆశలు

రైల్వే ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న కొత్త పెన్షన్ స్కీం స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీం రావడంతో కాస్త శాంతించిన ఉద్యోగులు మరి కొన్ని డిమాండ్లను చేస్తున్నారు. కరోనా సమయంలో రావాల్సిన 18 నెలల డీఏను ఈ బడ్జెట్ ద్వారా విడుదల చేయాలని, కొవిడ్-19లో చనిపోయిన ఉద్యోగులకు రూ.50 లక్షల పరిహారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులకు ఆదాయపు పన్ను విధింపు కనిష్ఠ ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని ఆశిస్తున్నారు. శిథిలమైపోయిన రైల్వే క్వార్టర్స్‌ను పునర్నిర్మించాలని కోరుతున్నారు. లోకో రన్నింగ్ స్టాఫ్‌కు లభిస్తున్న కి.మీ. అలవెన్సును ఆదాయపు పన్ను పరిధి నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

కొవిడ్ రైళ్లను నడపాలని కోరా



కొవిడ్-19 సమయంలో పలు ప్యాసింజరు రైళ్లు, ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేశారు. వాటిని పునరుద్ధరించాలంటూ డీఆర్‌ఎం ద్వారా రైల్వే మంత్రిత్వ శాఖకు విన్నపం పంపాము. గుంతకల్లులో ట్రాఫిక్‌కు సమస్యగా మారిన ధర్మవరం గేటు, బళ్లారి బైపాస్ లెవెల్ క్రాసింగ్‌లను తొలగించి ఆర్‌యూబీలను నిర్మించాలని, రాష్ట్ర రాజధానికి గుంతకల్లు నుంచి ఎక్స్‌ప్రెస్, ప్యాసింజరు రైళ్లను నడపాలని ప్రతిపాదించాం.

-ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ఆదాయ పన్ను మార్జిన్‌ను పెంచాలి



కేంద్ర ఉద్యోగులకు ఆదాయ పన్ను విధింపు స్లాబ్‌లను పెంచాలని కొన్నేళ్ల నుంచీ డిమాండ్ చేస్తున్నాం. కనీస ట్యాక్స్ మొత్తం రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉంది. గ్రూప్-4 ఉద్యోగులు పూర్తిగా ఆదాయపు పన్ను పరిధిలో లేని విధంగా స్లాబ్‌లను ఏర్పరచాలి. రైల్వే క్వార్టర్సు నిర్మాణ కార్యక్రమం కొన్నేళ్లుగా నిలిపి వేశారు. గత సంవత్సరం తొలిసారిగా అరకొర నిధులు ఇచ్చారు. డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లోనే వెయ్యి క్వార్టర్సును నిర్మించాల్సి ఉంది. ఇక సైడింగ్ స్టేషన్లలో ఉన్న క్వార్టర్స్ అన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. కరోనాలో పెండింగ్‌లో ఉంచిన రైల్వే ఉద్యోగుల డీఏ బకాయిలు, చనిపోయిన ఉద్యోగులకు రూ. 50 లక్షల పరిహారానికి సంబంధించి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

- ప్రభాకర్, ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి

కేడర్ రీకన్‌స్ట్రక్షన్ చేయాలి



2023 నుంచి కేడర్ రీకన్‌స్ట్రక్షన్ జరగలేదు. ఉద్యోగులకు ప్రమోషన్లలో జాప్యం జరుగుతోంది. వెంటనే కేడర్ రీకన్‌స్ట్రక్షన్‌కు అనుమతులివ్వాలి. 8వ ఆర్థిక సంఘాన్ని నియమించారు. అది త్వరగా సిఫారసులను ఇవ్వడానికి తగిన విధంగా బడ్జెట్‌లో నిధులను కేటాయించాలి. రైళ్లను పెంచుతున్నారుగానీ, అందుకు తగినట్లు ఉద్యోగ నియామకాలు చేయడం లేదు. పని ఒత్తిడిని తగ్గించడానికి ఉద్యోగ నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి.

-విజయకుమార్, మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

క్లార్క్ గేబుల్ (జయంతి)



'ది కింగ్ ఆఫ్ హాలీవుడ్'గా పిలవబడిన విలియం క్లార్క్ గేబుల్ 1901 ఫిబ్రవరి 1న జన్మించారు. అమెరికాలో పేరొందిన నటుడు. 1924-26 మధ్య మూకీ సినిమాలతో వెండితెరపై ప్రవేశించారు. అనంతరం హీరో, విలన్ పాత్రలలో నటించారు. 37ఏళ్లలో 60కుపైగా సినిమాలలో నటించారు. అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌చే 'సెవెన్త్ గ్రేటెస్ట్ మేల్ స్టార్ ఆఫ్ క్లాజిక్ అమెరికన్ సినిమా'గా పేరొందారు. 1960 నవంబరు 16న గుండెపోటుతో కన్నుమూశారు.

ఎస్‌జే పెరెల్‌మన్ (జయంతి)



సిడ్నీ జోసెఫ్ పెరెల్‌మన్ 1904 ఫిబ్రవరి 1న న్యూయార్క్‌లో జన్మించారు. అమెరికాకు చెందిన హాస్యవేత్త, స్క్రీన్‌రైటర్. ప్రత్యేకించి చిన్నకథలు ఎంతో ఆదరణ పొందాయి. 1930, 40 దశకాలలో 'ది న్యూయార్కర్' సహా ఎన్నో మ్యాగజైన్‌లకు రచనలు అందించారు. నాటకాలకు, రచనలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 'అరౌండ్ ది వరల్డ్ ఇన్ 80 డేస్'కు అకాడమీ అవార్డు పొందారు. పలు రచనలు హాలీవుడ్ సహా ప్రపంచ వ్యాప్తంగా పేరొందాయి. 1979 అక్టోబరు 17న కన్నుమూశారు.

అంజిరెడ్డి (జయంతి)



దేశంలోనే ప్రముఖ ఫార్మాగా పేరొందిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, 'పద్మభూషణ్' గ్రహీత కల్లం అంజిరెడ్డి 1939 ఫిబ్రవరి 1న గుంటూరు జిల్లా తాడేపల్లిలో జన్మించారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంతర్జాతీయ ఖ్యాతి పొందారు. ఫోర్బ్స్ సంస్థ విడుదల చేసిన దేశ వందమంది సంపన్నుల జాబితాలో 64వ స్థానం దక్కింది. 1984లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్థాపించిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ అంచెలంచెలుగా ఎదిగింది. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన తొలి ఆసియా ఫార్మా కంపెనీ ఇదే. గ్రామీణ నిరుపేద యువకుల ఉపాధి శిక్షణకు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సర్ పీసీ రాయ్ అవార్డు, పద్మశ్రీ, హాల్ ఆఫ్ ఫేం తదితర పురస్కారాలు పొందారు. 2013 మార్చి 15న అనారోగ్యంతో కన్నుమూశారు.

కల్పనా చావ్లా (వర్ధంతి)



అంతరిక్షంలో ప్రవేశించిన దేశ తొలి మహిళగా గుర్తింపు పొందిన కల్పనా చావ్లా 1962 మార్చి 17న హర్యానా రాష్ట్రం కర్నాల్ పట్టణంలో జన్మించారు. వ్యోమగామి, ఇంజనీర్. 1997 'స్పేస్ షటిల్ కొలంబియా' మిషన్‌లో రోబోటిక్ ఆర్మ్ ఆపరేటర్‌గా వ్యవహరించారు. 2003లో స్పేస్ షటిల్ కొలంబియా డిసాస్టర్‌లో పాల్గొని 2003 ఫిబ్రవరి 1న ప్రమాదవశాత్తు ఏడుగురు క్ర్యూ సభ్యులు సహా మృత్యువాత పడ్డారు. ఆమె జ్ఞాపకార్థం 'మెట్‌సాట్' మెటీరియలాజికల్ సిరీస్ ఆఫ్ శాటిలైట్‌కు కల్పనాగా అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ నామకరణం చేశారు.

బ్రహ్మానందం (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత కన్నెగంటి బ్రహ్మానందం 1956 ఫిబ్రవరి 1న గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా) చాగంటివారిపాలెం ప్రాంతంలో జన్మించారు. ప్రఖ్యాత తెలుగు హాస్య నటుడు. జంధ్యాల దర్శకత్వంలోని 'అహనా పెళ్ళంట' తొలి సినిమాతోనే గుర్తింపు పొందారు. వివిధ భాషలలో వెయ్యికిపైగా సినిమాలలో నటించి 2010లో గిన్నిస్ రికార్డుల్లోకి చేరారు. ఉత్తమ హాస్య నటుడిగా ఐదు నంది పురస్కారాలు, ఒక ఫిల్మ్‌ఫేర్, ఆరు 'సినీ మా' అవార్డు, మూడు సైమా అవార్డులు అందుకున్నారు. 2005లో నాగార్జున విశ్వవిద్యాలయంనుంచి గౌరవ డాక్టరేట్, ఇంకా రాజీవ్‌గాంధీ సద్భావనా పురస్కారం ఇతరత్రా గౌరవాలు పొందారు.

ప్రియదర్శిని గోవింద్ (పుట్టినరోజు)



ప్రియదర్శిని గోవింద్ 1965 ఫిబ్రవరి 1న చెన్నైలో జన్మించారు. భరత నాట్యంలో పేరొందిన కళాకారిణి. నాట్యానికి సంప్రదాయంతోపాటు కొత్తదనంతో వన్నె తెచ్చారు. దేశంలోని ప్రముఖప్రాంతాలతోపాటు విదేశాలలోనూ నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. కేరళకు చెందిన మార్షల్ ఆర్ట్ కలరియపట్టులోనూ తర్ఫీదు పొందారు. నృత్య చూడామణి, వసంతలక్ష్మి నరసింహాచారి అవార్డు, సింగర్‌మణి, కలైమామణి, యువ కళాభారతి అవార్డు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు పొందారు.

పెళ్లి చేసుకుంటానని రూ.18లక్షల మోసం

● నెలమంగలలో కేసు నమోదు

బెంగళూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ఓ వ్యక్తి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) మహిళా కానిస్టేబుల్‌ను మోసం చేసినమేరకు నెలమంగల పరిధిలోని డాబస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. యాదవ మ్యాట్రిమోని ద్వారా మహిళా కానిస్టేబుల్ సంబంధాలకోసం వెతికారు. అశోక్‌మూర్తి అనే వ్యక్తి మ్యాట్రిమోని ద్వారా పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం సిద్ధమవుతున్నానని నమ్మించారు. ఆ తర్వాత కుటుంబసభ్యులతోపాటు వచ్చి ఒప్పించారు. రూ.20లక్షలు వరకట్నం డిమాండ్ పెట్టారు. పెళ్లి చేసుకుంటాననే నమ్మకంతో రూ.18లక్షల రూపాయలు మహిళా కానిస్టేబుల్ బదిలీ చేశారు. ఇటీవల అతడి ప్రవర్తనలో మార్పు రావడం, ఫోన్‌కు స్పందించకపోవడంతో మహిళా కానిస్టేబుల్ డాబస్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన అశోక్‌మిస్త్రీ, అతడి బంధువులపై కేసు నమోదు చేశారు.

వాసవాంబకు వందనం..!



లగ్గెరెలో భజనలు నిర్వహిస్తున్న భక్తులు



బెంగళూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని జయనగర్ సిద్దాపుర వార్డులో శుక్రవారం వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినం సందర్భంగా విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శ్రీరామసేవా సముదాయ భవనంలో ఉదయం ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, కళశ పూజ నిర్వహించారు. గణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం, వాసవీదేవి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి 102 గోత్రాల పేరిట మందార ఆకులతో అలంకరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్యమండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా లగ్గెరెలోనూ స్థానిక ఆర్యవైశ్య సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలోనూ విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు ధార్మిక కార్యక్రమాల అనంతరం భజనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చేళూరులో...

చేళూరు: తాలూకా కేంద్రమైన చేళూరులో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మూలవిరాట్టుకు విశేషపూజలు, అలంకరణ నిర్వహించారు. ఆర్యవైశ్యులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కంప్లిలో..

కంప్లి : పట్టణంలో వాసవీ మాత ఆలయంలో ఆర్యవైశ్యులు వాసవీమాత అగ్నిప్రవేశం సందర్భంగా ఆలయంలో లోకకళ్యాణార్థం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రత్యేక హోమాలు కూడా చేపట్టారు. ఉదయం పంచామృతాభిషేకం, గంగాజలాభిషేకం, ప్రత్యేక పూజలు, మహాలక్ష్మీ హోమం, లలిత సహస్రనామార్చన, కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వాసవీ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానాలు కూడా చేశారు.



కంప్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఉత్తర తాలూకాలో చిరుతల సంచారం

బెంగళూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర తాలూకాలోని జనావాసాల ప్రాంతాల్లో రెండు చిరుతల సంచారం ఉన్నట్టు సీసీటీవీ ఫుటేజీల ద్వారా వెలుగు చూసింది. దీంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై ప్రజలను హెచ్చరించారు. ప్రత్యేకించి హెసరఘట్ట-యలహంక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శివారు ప్రాంత వాసులు చుట్టుపక్కల వన్యప్రాణుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కాగా ఇటీవల ఆనేకల్ ప్రాంతంలోనూ చిరుత సంచారాన్ని గుర్తించామన్నారు. ఇటీవలికాలంలో వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయని కారణాలు ఏమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. చిరుతల సంచారం ఉన్నచోట్ల వాటిని బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



విరగ్గాసిన దోస

కీరదోసకు పెరిగిన డిమాండ్

హోసూరు జనవరి 31(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ఆరోగ్యకరమైన ఆహారంగా భావించే కీరదోస విక్రయాలు హోసూరుల్లో జోరుగా సాగుతున్నాయి. డెంకణీకోట, కెలమంగలం, బాగలూరు, తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో గ్రామాల రైతులు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏటా 500 ఎకరాల విస్తీర్ణంలో కీరదోస సాగు చేశారు. ప్రస్తుతానికి కిలో రూ.20 నుంచి రూ.25 వరకు పలుకుతోంది. రానున్న రోజుల్లో రూ.50 నుంచి రూ.60 వరకు ధర వస్తుందని రైతులు అంటున్నారు.. వేసవి ప్రారంభం కాకముందే హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో కీరదోస విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడి నుంచి పలు జిల్లాలకు ఎగుమతి సైతం అవుతున్నాయి.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు

రాయచూరు జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారిగా ఉన్న రెండు రోడ్లలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగళ్ల ముందు అడ్డదిడ్డంగా ఆగిన వాహనాలను స్టేషన్‌కు తరలించిన అధికారులు ఫుట్‌పాత్‌లను ఆక్రయించి నిర్వహిస్తున్న దుకాణాలను సహితం తొలగించేశారు. ప్రధాన రహదారులుగా ఉన్న బసవేశ్వర సర్కిల్, చంద్రమౌళేశ్వర సర్కిల్ అక్కడి నుంచి గంజ్ సర్కిల్ వరకు ఉన్న రోడ్ల పై పెద్ద ఎత్తున అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పోలీస్ అధికారి, వాహన సంచారం పెద్ద ఎత్తున పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మహానగర పాలిక కమిషనర్ నుంచి ఇప్పటికే తమకు తగిన ఆదేశాలు ఉన్నాయని ఈ విషయంలో జిల్లాధికారి సహితం కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. కాగా ఇప్పటికే ఉన్న ట్రాఫిక్ నిబంధనల మేరకు వారంలో ఒకే సైడ్ వాహనాలు పార్కింగ్ చేసేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినా వాహనదారులు వాటిని పట్టించుకోకుండా ఉల్లంఘిస్తున్నారని ఈ విషయంలో ట్రాఫిక్ పోలీసులు కఠిణంగా వ్యవహరించక తప్పడం లేదని స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించి వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపేవారి పట్ల మరింత కఠిణంగా వ్యవహరిస్తామన్నారు.



అడ్డదిడ్డంగా ఆపిన వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మొక్కల పెంపకంతో పర్యావరణ సంరక్షణ

● ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి

మహదేవపుర, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే పర్యావరణ సంరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని వర్తూరు చెరువులో 'సే ట్రీస్' సహా వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో 3వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మొక్కలకు నీరు పోసిన అనంతరం ఆమె మాట్లాడుతూ పచ్చదనంతోనే మన పరిసరాలు బాగుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ మంత్రి అరవింద లింబావళి చేపట్టిన పనులు మాదిరిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మహదేవపుర టాస్క్‌ఫోర్స్ జలశక్తి అధ్యక్షుడు మనోహరరెడ్డి, నగర జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రమోది, రాష్ట్ర వెనుకబడినవర్గాల ప్రధాన కార్యదర్శి బిఎస్ శ్రీధర్, ప్రముఖులు రక్షిత్, బీడీఏ సహాయక కార్యవర్గ ఇంజనీర్ బీజీ కవిత, సహాయక ఇంజనీర్ రెడ్డియప్ప, సే ట్రీస్ సంస్థ సీఈఓ దేవకంత్, మధుసూదన్ వందలాదిమంది పర్యావరణ ప్రేమికులు, స్వయంసేవకులు పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

అధికారుల నివాసాలపై లోకాయుక్త దాడులు



రాయచూరులోని దేవర కాలనీలోని రెండంతస్తుల భవంతి

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన ఆరోపణల మేరకు పకడ్బందీ వ్యూహంతో బెళగావి, బాగల్కోటె, బెంగళూరులలో శుక్రవారం మెరుపుదాడులు చేశారు. బెంగళూరు హెబ్బాళ పరిధిలోని అసిస్టెంట్ ఇంజనీర్ మాధవరావ్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ సెక్రటరీ టీచర్ రమేశ్‌లకు సంబంధించి కార్యాలయాలు, నివాసాలపై దాడులు చేశారు. బాగల్కోటెలోని విద్యాగిరి పరిధిలో హళాళగెరె గ్రామ పంచాయతీ పీడీఓ హిరేమఠ నివాసం దాడి చేశారు. రాయచూరులోని జిల్లాపంచాయతీ అకౌంట్ అధికారి నరసింగరావ్ ఇంటిపైనా దాడులు నిర్వహించారు. బెళగావిలోని సబ్‌రిజిస్ట్రార్ సచినమండేడ్‌కు సంబంధించి కార్యాలయంతోపాటు మూడు చోట్ల దాడులు చేశారు. రాయబాగ తాలూకా ఆరోగేరి పశువైద్యాధికారి సంజయ్ ఇంటిపైనా దాడి చేశారు. వీరి నుంచి భారీగా ఆస్తిపత్రాలు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. హిరేమఠ్ నివాసంలో భారీగా నగదు లభించింది. చిత్రదుర్గ జిల్లా బీసీ కార్పొరేషన్ మేనేజర్ శశిధర్, గ్రామీణాభివృద్ధిశాఖ డిప్యూటీ సెక్రటరీ వీకే రమేశ్ నివాసాలపై దాడులు చేశారు.

రాయచూరులో..



నరసింహారావ్ గుజ్జార్

రాయచూరు: జిల్లా పంచాయతీ సహాయ లెక్కాధికారిగా పని చేస్తున్న నరసింహారావ్ గుజ్జార్ ఇంటిపై శుక్రవారం లోకాయుక్త అధికారులు దాడులు జరిపారు. నగరంలోని దేవర కాలనీలోని గృహంతో పాటు ఆయన పని చేస్తున్న కార్యాలయంలోను లోకాయుక్త అధికారులు శోధాలు నిర్వహించారు. దేవర కాలనీలోని రెండంతస్తుల బిల్డింగ్, రెండు ప్లాట్‌లు, వాహనం, బ్యాంక్ ఖాతాలతో పాటు ఇతర ఆస్తులకు సంబంధించి లోకాయుక్త అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దాడిలో లోకాయుక్త జిల్లా ఎస్పీ సిద్ధరాజు, డీఎస్పీ శైలజా, సీపీఐ రవి పురుశోత్తమ్ తదితరులున్నారు.

ప్రారంభానికి నోచుకోని అతిథి గృహం



ప్రధాన ద్వారం వద్దే సంచరిస్తున్న శునకాలు

కంప్లి, జనవరి 31(ఆంధ్ర జ్యోతి): పట్టణ నడిబొడ్డున నూతనంగా నిర్మించిన అతిథి గృహం రోజులు గడుస్తున్నా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. సెప్టెంబరు 19, 2021వ సంవత్సరంలో రూ. 1.50 కోట్లతో ఆనంద్ సింగ్ పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈ అతిథి గృహం నిర్మాణానికి భూమిపూజ చేశారు. అయితే మూడేళ్ల అనంతరం నిర్మాణం పూర్తి చేశారు. ఈ భవనం పూర్తయినప్పటికీ రోజులు, నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఈ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఈ భవనంలో శునకాలు సేద తీరుతున్నాయి. అతిథి గృహం అధికారులకు, ప్రజాప్రతినిధులకు కాకుండా శునకాలకు ఆవాసంగా మారింది. ఇది పూర్తి అయ్యి చాలా కాలమైన ఎమ్మెల్యే ఎందుకు ప్రారంభించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో మద్యపాన ప్రియులకు కూడా ఈ భవనం అడ్డాగా మారింది. ఈ భవనం ప్రారంభమైతే ప్రజా ప్రతినిధులకు, ఉద్యోగులకు అనుకూలంగా వుంటుంది. ప్రస్తుతం వున్న శిథిలావస్థకు చేరుకున్న అతిథి గృహంలోనే పై స్థాయి అధికారులు వచ్చి సేదతీరుతున్నారు. అన్ని సౌకర్యాలున్న నూతన అతిథి గృహం మాత్రం ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే శునకాలు సేదతీరే గృహం కాకుండా దానిని ప్రారంభించి అందరికి ఉపయోగంలోకి తేవాలని కోరుతున్నారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సులు


రాయదుర్గం రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు జిల్లా నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. మహాకుంభమేళా యాత్ర కు ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన రెండు బస్సులను శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా మహా కుంభమేళా యాత్రకు రాయదుర్గం నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 11 రోజుల పాటు జరిగే ఈ యాత్రలో ప్రయాణికులు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, కార్గో డీఎంఈ నాగరాజు, గ్యారేజ్ ఇన్‌చార్జ్ శిరీష, అసిస్టెంట్ మేనేజర్ సురేంద్ర బాబు, యూనియన్ నాయకులు తిప్పేస్వామి, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దగ్ధం

రాయచూరు జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆశాపూర్ రోడ్డు గంగానగర్ కాలనిలో ఎలెక్ట్రిక్ వాహనానికి నిప్పంటుకుని పక్కన ఉన్న నాల్గు వాహనాలు కాలిపోయాయి. శుక్రవారం జరిగిన సంఘటనతో కాలనీలో బెంబేలెత్తారు. ఇంటి ముందు ఆపి ఉన్న ఎలెక్ట్రిక్ బైక్‌కు యజమాని చార్జింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎలెక్ట్రిక్ వాహనానికి ఒక్కసారిగా నిప్పంటుకోగా మంటలార్పే అవకాశం కూడా లేకపోవడంతో సమీపంలోని నాల్గు వాహనాలకు మంటలు వ్యాప్తి చెంది వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో రాకపోవడంతో వాహనం వచ్చే సరికి మంటల్లో నాల్గు వాహనాలు కాలిపోయాయి. దీంతో దాదాపు రూ.5లక్షలకు పైగా నష్టం జరిగినట్లు వాహన యజమానులు తెలిపారు.



దగ్ధమవుతున్న వాహనాలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బళ్లారి సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ వాసవి విద్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. దేహదారుఢ్యం ప్రముఖ అంశాలను పరీక్షించడానికి ప్రముఖ వైద్యుల బృందం పాల్గొన్నారు. విద్యార్థుల ఎత్తు, బరువు, దృష్టి, శక్తి పరీక్షలు,గుండె, శ్వాసకోశ స్థితి, దంత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అనుసరించాలన్నారు. పోషకులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● సివిల్ న్యాయాధికారి వీరప్ప

సిరుగుప్ప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సివిల్ న్యాయాధికారి వీరప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం సివిల్ కోర్టు ఆవరణంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయాధికారి వీరప్ప మాట్లాడుతూ మనిషికి ఉత్తమ ఆరోగ్యం కోసం మొదటగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నగరసభ పౌర కార్మికులు పట్టణంలో చెత్తాచెదారం పడకుండా పరిశుభ్రతగా వుంచుకోవాలని ఆయన తెలిపారు. పౌర కార్మికులు న్యాయవాదులచే ప్రమాణాన్ని చేయించారు.

ప్రత్యేక బస్సులు నడపండి



బస్సుకోసం వేచి ఉన్న విద్యార్థులు

కంప్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కంప్లి, గంగావతిలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సులు నడపాలని విద్యార్థులు కోరారు. బీఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షులు చెన్నప్ప మాట్లాడుతూ ఉదయం వేళ కళాశాల విద్యార్థులు, పాఠశాలకు వెళ్లు విద్యార్థులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.. హొస్పేట వద్ద రైల్వే ట్రాక్ పనుల వల్ల వీడీ హళ్లి మీదుగా తిరిగి రావడంతో బస్సులు సరియైన సమయానికి రాకపోవడంతో విద్యార్థులు సరియైన సమయానికి కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సాయంత్రం వేళ 5 గంటల నుంచి బస్సులు సక్రమంగా లేక ఉన్న ఒకటి రెండు బస్సులపైన ఫుట్‌బోర్డుపై ఒకరిపైఒకరు నెట్టుకుంటూ ప్రయాణం చేస్తున్నారు. ఎప్పుడు ఏ సమయంలో ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కనుక ఉదయం సాయంత్రం వేళల్లో కంప్లి గంగావతి మధ్య బస్సులు నడిపి విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.

గర్భిణుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

● మదర్ కార్డు ఉచితంగా ఇవ్వాలి ● రోజూ ఐరన్ మాత్రలు అందేలా చూడాలి : సీఈఓ రాహుల్ శరణప్ప



ఆరోగ్య కార్యకర్తలను సన్మానిస్తున్న వైద్యాధికారులు

బళ్లారి సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గర్భిణీ అని తెలిసిన నాటి నుంచి వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వెంటనే మదర్ కార్డును ఉచితంగా అందించాలని, గర్భిణుల ఆరోగ్యంపై నిత్యం దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లాపంచాయతీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా ఆరోగ్య సంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వైద్యులు గర్భిణీలకు ఆరోగ్య పరీక్షల సమయంలో రక్తంలో ఐరన్ మోతాదు గురించి తెలియజేయాలన్నారు. ఐరన్, కాల్షియం మాత్రలు మింగడం వల్ల పిల్లల ఎదుగుదల సక్రమంగా జరుగుతుందని ప్రసవ సమయంలో రక్తహీనత రాకుండా ఉంటుందని తెలిపారు. ఆరు నెలల కాలంలో కనీసం 180 ఐరన్ మాత్రలు ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి పర్యవేక్షించాలన్నారు. బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు వైద్యాధికారులు ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి గర్భిణుల మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ద్వారా గర్భిణుల సంరక్షణను ప్రోత్సహించిందుకుగాను ప్రతినెలాఒక ప్రైమరీ కేర్ ఆఫీసర్, ఆశా వర్కర్లను గుర్తించి సన్మానించాలని నిర్ణయించామన్నారు. ఈనెలలో అరుణజ్యోతి, చౌడమ్మలను ఘనంగా సన్మానించారు. పాముకాటుకు గురైన వ్యక్తికి 10 ఓయిల్ యాంటీవీనమ్ వ్యాక్సిన్ తప్పనిసరిగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లోని మార్గదర్శకాల ప్రకారం ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతంల్లో అంధత్వం ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి తప్పకుండా శస్త్రచికిత్స చేయించాలన్నారు. ప్రస్తుతం 9,884 మందికి శస్త్ర చికిత్సలు జరిగాయని, ప్రయివేటు ఆసుపత్రుల కంటే ప్రభుత్వాసుపత్రుల్లోనే ఎక్కువ సంఖ్యలో శస్త్రచికిత్స చేయాలని సూచించారు. దృష్టిలోపం ఉన్న పిల్లలకు పాఠశాలల్లో సమర్థవంతంగా గుర్తించాలి. ఆతర్వాత అద్దాలు పంపిణీ చేయాలి.

అవయవ దానం

జాతీయస్థాయిలో అగ్రగామిగా ఉన్న జిల్లాలో ఇప్పటికే 7,092అవయవదానాలు నమోదయ్యాయని, ఇంకా నమోదు జరుగుతోందని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డా. రమేశ్‌బాబు తెలిపారు. మరిన్ని నంబర్లు నమోదు చేసుకోవాలని జిల్లాపంచాయతీ సీఈఓ సూచించారు. డెంగీ, చికున్‌గున్యా, క్షయవ్యాధి, మాతా శిశు సంరక్షణ , మానసిక ఆరోగ్యంపై కూడా సమావేశంలో చర్చించారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డా.రమేశ్‌బాబు, జిల్లాసర్జన్ బసారెడ్డి, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డా.హనుమంతప్ప, జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియంబి, జిల్లామలేరియా నియంత్రణ అధికారి డా.అబ్దుల్లా , డా. ఇంద్రాణి, డా.వీరేంద్రకుమార్, బసవరాజ్, డా.అరుణ్‌కుమార్, డా.భరత్, డా.మంజునాథ, డా.సురేశ్‌కుమార్, డా.ప్రియాంక, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర దాసప్పనవర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



ఉచిత శిక్షణలో పాల్గొన్న మహిళలు

బళ్లారి రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని దుర్గమ్మ గుడి సర్కిల్ సమీపంలో శ్రీషిర్డీ సాయి సేవా సత్సంగం ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించారు. ట్రస్టు అధ్యక్షుడు ఆర్ గోపాల కృష్ణ మహిళలకు కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ, చీరలకు, జాకెట్లకు స్పెషల్ డిజైన్స్ తదితర వాటిపై శిక్షణ అందించినట్లు తెలిపారు. టైలరింగ్, మగ్గం, కంప్యూటర్ పలు సేవలు మహిళలకు అందుబాటులో అందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సాయిసుతే, గిరిజ శిక్షణలో పాల్గొన్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మూడు కూనలతో చిరుత ప్రత్యక్షం

బళ్లారి గాంధీనగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ జిల్లా, హిరియూరు తాలూకా ఐమంగళ ఫిర్కా పరిధిలోని రామజోగినహళ్ళి-సొండెకెరె గ్రామం సరిహద్దు అంగడి జయణ్ణకు చెందిన పొలంలో శుక్రవారం ఉదయం మూడు పిల్ల కూనలతో చిరుత ప్రత్యక్షమైంది. పొలంలో ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న సమయంలో మూడు పిల్లలతో బయటకు వచ్చి కొద్దిసేపు పరిసర ప్రాంతాలను వీక్షించి పొదల్లోకి వెళ్ళిపోయినట్లు రైతు తెలిపాడు. పిల్లలతో వచ్చిన పులికి సంబంధించిన రైతు తీసిన వీడియోలో కళ్ళగురుతులు స్పష్టంగా కనిపించడం లేదని, అడవి పిల్లి కూడా ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతు ఆధారాల మేరకు పులి కనిపించిన స్థలాన్ని పరిశీలించనున్నట్లు అటవీశాఖ అధికారి శశిధర్ తెలిపారు.

షెడ్డు దగ్ధం.. మూడు గేదెలు మృతి



దగ్ధమవుతున్న గేదెల షెడ్డు

కంప్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా పరిధిలోని కృష్ణానగర్ క్యాంపు వద్దగురువారం రాత్రి ఆకస్మికంగా బొప్పన్న రాజగోపాలరావు షెడ్డులో మంటలు ఏర్పడి కాలిపోయింది. షెడ్డులో కట్టేసిన మూడు గేదెలు, డీజిల్ డ్రమ్ములు, ఇంటి సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. ఒక్కసారిగా రాత్రి 11 గంటల సమయంలో మంటలు ఏర్పడటంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్నిమాపక దళాలను సంప్రదించేలోగా పూర్తిగా దగ్ధమైంది. ఇలా ఉన్నపళంగా మంటలు ఏర్పడటంతో క్యాంపువాసులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనిపై కంప్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

6 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు



మాట్లాడుతున్న రాఘవేంద్రప్రసాద్

బళ్లారి సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పురుషుల సీనియర్ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నగరంలోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఈ నెల 6నుంచి 4రోజుల పాటు జరగనున్నట్లు బళ్లారి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంఘం కార్యదర్శి రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6వ తేది సాయంత్రం 4గంటలకు నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి క్రీడాపోటీలను ప్రారంభిస్తారన్నారు. బళ్లారి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోజు 'గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహిస్తామన్నారు. దేశంలోని 30 రాష్ట్రాల నుంచి 635 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారు. పోటీలు 8 కోర్టుల్లో నిర్వహిస్తున్నట్లు, తెలిపారు. బెస్ట్ ఆఫ్ త్రీ లీగ్ కమ్ నాకౌట్ విధానంలో 35 పాయింట్లు ఉంటాయి. ఇందులో టర్ఫ్‌కోర్టు కూడా ఉంటుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు కోలాచలం శ్రీధర్, నాగభూషన్, నయీద్ బాషా, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావులకు ఘన సన్మానం



మంత్రిని అభినందిస్తున్న వాల్మీకి నాయకులు

బళ్లారిరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మంత్రి పయ్యావుల కేశవకు టీడీపీ కార్యాలయంలో బళ్లారికి చెందిన అఖండ కర్ణాటక వాల్మీకి నాయక రాష్ట్ర అధ్యక్షులు జోళదరాసి తిమ్మప్ప ఘనంగా సన్మానించారు. మంత్రి పయ్యావుల కేశవకు ఉరవకొండ పార్టీ కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ఆంధ్రలో అత్యధిక మెజార్టీతో గెలవడంతో ఆయనను తిమ్మప్ప ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంచలపాడు ప్రతాప్ నాయుడు, హావలిగి జనార్దన్, లక్ష్మీకాంతగౌడ, బసవరాజు పాల్గొన్నారు.



ఎస్పీ శోభారాణిని అభినందిస్తున్న కుల సంఘాల నాయకులు

ఎస్పీకి కుల సంఘాల నాయకుల అభినందనలు

● కిడ్నాప్ కేసును సత్వరమే ఛేదించారని ప్రశంసలు

బళ్లారి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలో సంచలనం రేపిన కిడ్నాప్ కేసును ఛేదించి డాక్టర్ సునీల్ కుమార్‌ను సురక్షితంగా విడిపించడంపై పలువురు ఎస్పీ శోభారాణి, పోలీసు బృందాన్ని ప్రశంసించారు. శుక్రవారం బళ్లారి లో కమ్మ, రెడ్డి సంఘం, ఆర్యవైశ్య తదితర సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి, కమ్మ సంఘ అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నామా నాగరాజు, డాక్టర్ రమేష్ గోపాల్, మారుతి తదితరులు కనకదుర్గమ్మ గుడి నుంచి తరలివెళ్లి ఎస్పీని సన్మానించారు. అనంతరం రెడ్డి సంఘం అధ్యక్షుడు నారా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సునీల్ కుమార్ కిడ్నాప్ జరిగిన 12 గంటల లోపే నిందితులను పట్టుకోవడం హర్షణీయమన్నారు. కమ్మ సంఘం అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్ మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతలు కాపాడడంతో పోలీసులు పాత్ర కీలకమన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, నారా నాగేశ్వరావు, బుడా మాజీ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, ఇతరులు ఎస్పీ శోభారాణిని ప్రశంసించారు.

పోలీస్ వెల్ఫేర్ ఫండ్‌కు రూ.3 లక్షల విరాళం

ఎస్పీ శోభారాణిని సన్మానించిన అనంతరం పోలీస్ వెల్ఫేర్ ఫండ్‌కు కమ్మ సంఘం తరుపున రూ.లక్ష, రెడ్డి సంఘం నుంచి రూ.లక్ష, ఆర్య వైశ్య సంఘం నుంచి రూ.లక్ష విరాళాన్ని ఆయా సంఘం నాయకులు అందజేశారు. మంచి పనులు చేసే పోలీసులకు ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, వివిధ రకాల వ్యాపారాలు చేసే వ్యక్తులు మహిళలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

● వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఖాసీం

సిరుగుప్ప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రావియాళ్ గ్రామా పంచాయతీ ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఖాసీం తెలిపారు. శుక్రవారం సిరుగుప్ప తాలుకాలోని రావియాళ్ గ్రామంలో తాలుకా ప్రభుత్వాస్పత్రి, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణ జాగృతి అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి, చర్మం, నరాలకు సంబంధించినది ఆయన తెలిపారు. చర్మానికి మొటిమలు, మచ్చలు, ఆరు నెలలు గడిచినా మానకపోతే ప్రభుత్వాస్పత్రిని సందర్శించి చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ ప్రజలచే కుష్టు వ్యాధి సోకకుండా చూసుకుంటామని ప్రమాణ స్వీకారాన్ని చేయించారు.

ఘనంగా డాక్టర్ బింద్రే జయంతి



జ్ఞానపీఠ అవార్డు గ్రహీతల చిత్రపటాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బళ్లారి సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కవి డాక్టర్ బింద్రే నాకుతంతి కవితా సంపుటానికి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అని కర్ణాటక రాష్ట్ర టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి తెలిపారు. శుక్రవారం బింద్రే జయంతిని తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలను ఆయన పరిచయం చేశారు. అక్షర బ్రహ్మగా పేరొందిన బింద్రే. నేనే నువ్వు, నేనే నువ్వు అనే నాలుగు మాటల్లో మనిషి జీవితాన్ని చిత్రించాడన్నారు. జీవితం రసం,విరసం మరణం అని చెప్పిన వ్యక్తి బింద్రే అన్నారు. హలకుంది క్లస్టర్ సీఆర్‌పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బింద్రే సరళ జీవితాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, చన్నమ్మ, వైశాలి, శ్వేత, ఉమ్మెహాని , శశమ్మ, రామాంజినేయ,గురుప్రసాద్, విజయ ముంద్రగి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంబిగర చౌడయ్య విగ్రహ ప్రతిష్ఠాపన



అంబిగరచౌడయ్య విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేష్, జగద్గురు శాంత భీష్మ చౌడయ్య

కంప్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని రామసాగర గ్రామంలో గంగామత సమాజం గురువులైన నిజశరణ అంబిగర చౌడయ్య విగ్రహ ప్రతిష్ఠాపన జగద్గురు శాంత భీష్మ చౌడయ్య, ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. అంతకుముందు అంబిగర చౌడయ్య విగ్రహ ఊరేగింపును ముత్తయిదువు మహిళల కలశాలతో ఊరేగించారు. అనంతరం శాంత భీష్మ చౌడయ్య మహాస్వాములు మాట్లాడుతూ సమాజం అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అప్పుడే అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా శిక్షణ రంగాలలో ముందడుగు వేస్తేనే సమాజానికి మరింత గుర్తింపు వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లాస్య, ఉపాధ్యక్షులు రామయ్య, శివశంకర్‌గౌడ, నారాయణప్ప, జగదీష్ గౌడ, హనుమంతప్ప, కారేకల్ మనోహర్, సిద్దప్ప, అయోధ్య వెంకటేష్, రామచంద్రప్ప, అంబిక జలగర్, గిరీష్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన గంగామత సమాజ సభ్యులు, అంబిగరచౌడయ్య యువజన సంఘం తదితరులు పాల్గొన్నారు.

'మైక్రో' వేధింపుల నుంచి ప్రజలను కాపాడాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

గంగావతి రూరల్ జనవరి 31(ఆంధ్రజ్యోతి): మైక్రోఫైనాన్సర్ల నుండి ప్రజలు ఎదుర్కొంటున్న వేధింపుల నుండి ప్రజలను కాపాడాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు శుక్రవారం గంగావతి పట్టణంలో ఆందోళన చేపట్టారు. కృష్ణదేవరాయ సర్కిల్‌లో చేరుకున్నఆందోళన కారులు మైక్రోఫైనాన్స్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో జిల్లా కార్యదర్శి ఎ.హులగప్ప మాట్లాడుతూ, రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్ కంపెనీల దాడులు పెరిగిపోయాయని, అధిక వడ్డీలతో ప్రజలను పీడిస్తున్నారన్నారు. కొంతమంది ఫైనాన్సర్ల వేధింపులు, ఒత్తిళ్ళు తట్టుకోలేక ఊళ్ళు, ఇళ్ళు సైతం ఖాళీ చేసేపరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తాలూకా కార్యదర్శి ఎ.ఎల్.తమ్మణ్ణ, శేఖమ్మ, హుసేనప్ప, భద్రినాథ్, రూరబియా, నాగరాజలతో పాటు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హోసూరు జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేఎంటీ, జూజువాడి, బేగేపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే హోసూరు సబ్ స్టేషన్ పరిధిలోని టీవీఎస్ నగర్, అందివాడీ, మత్తిగిరి, టైటాన్ టౌన్‌షిప్, గాడిపాళ్యం కోతిపాళ్యం, పాత మత్తిగిరి, యడేనల్లూరు, శివకుమార్ నగర్, కొత్తూరు, కొత్తగొండపల్లి, బొమ్మండపల్లి, మునీశ్వర నగర్, అథవన్ నగర్, ద్వారకానగర్, మత్తం న్యూహడ్కో, ఓల్డ్ హడ్కో, మహాలక్ష్మీనగర్, ఫేస్-1 ఫేస్-2 రాంనగర్, బస్టాండ్, శ్రీనగర్, అప్పావు నగర్, కామరాజ కాలనీ, అన్నానగర్, టైటాన్ ఇండస్ట్రీస్, అశోక్‌లైలాండ్, సిప్‌కాట్-1 హౌసింగ్ కాలనీ నేతాజీ నగర్, బాలాజీ నగర్, చిన్న యలసగిరి, ఆనందనగర్, శాంతపురం, అరసనట్టి, ఎన్‌జీఓఎస్ కాలనీ, కేసీసీ నగర్, సూర్య నగర్, బృందావన్ నగర్, అన్నామలై నగర్, కృష్ణానగర్, కెంబట్టి, బేలగొండపల్లి, మదగొండపల్లి, పూనపల్లి, ముత్తూరు, కప్పకల్, ఉలివీరనపల్లి, ఉప్పారపల్లి, తలి ఉబ్బనూరే, కురుబరపల్లి, కె.అగ్రహారం, కుప్పటి, పూనపల్లి, జాగీర్‌కోడిపల్లి, కె.అగ్రహారం, కుప్పట్టి, డి.కొత్తూరు, నల్లసందిరం, తారవేందిరం, బి.బి.పాళ్యం, జవలగిరి,అగలకోట్టై, మానుపల్లి, కెంబత్తపల్లి, ఉణిసేనత్తం, బిన్నమంగలం, కక్కదాసం, జూజూవాడి మరియు బీగేపల్లి సబ్ స్టేషన్ సిప్‌కాట్ మూక్కొండపల్లి, బేడరపల్లి, దర్గా, సిప్‌కాట్ నిబుసింగ్‌కాలనీ, అరసనట్టి, సిప్‌కాట్ ఫేస్-1 నుంచి సూర్యనగర్, భారతీనగర్, ఎం.జీ.ఆర్ నగర్, కామరాజ్ నగర్, ఎళిల్‌నగర్, రాజేశ్వరీ లేఔట్, నల్లూరు , చిత్తన్నపల్లి, మడివాళం, నల్లురు అగ్రహారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు

● లారీ యజమానుల ఆందోళన



నిరసన తెలుపుతున్న లారీ యజమానులు

హోసూరు జనవరి 31(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోయాయని లారీ యజమానుల సంఘం నాయకులు వాపోతున్నారు. డెంకణీకోట సమీపంలో పెద్ద సంఖ్యలో క్వారీలు ఉన్నాయని, ట్రక్కులు, టిప్పర్లలో వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తుంటామన్నారు. గత నెల నుంచి కంకరతోపాటు ఎం.శాండ్, బి.శాండ్, రోబో ఇసుక ధరలు పెరిగాయన్నారు. టన్నుకు రూ.125 నుంచి రూ.225 వరకు పెంచారన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ధరల పెంపుతో 27వ తేదీ నుంచి సమ్మె కారణంగా పనులు లేక డ్రైవర్లు, క్లీనర్లు, తాత్కాలికంగా ఉపాధి పొందుతున్న వారి పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. రల పెంపుతో ఒక్కో ట్రక్కుకు 30 టన్నుల కంకర, ఇసుకను లోడ్ చేసినప్పుడు ధర 3 వేల నుంచి 4వేల వరకు పెరిగిందన్నారు. ఆ భారం యజమానులపై పడుతోందని, క్వారీ యజమానులు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థులకు అభినందనలు



ప్రతిభ చాటిన విద్యార్థులతో కలెక్టర్, ఉపాధ్యాయులు

హోసూరు జనవరి 31(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి కలెక్టరేట్‌లో 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు అధికారులు అభినందించారు. జాతీయ స్థాయిలో తమిళనాడు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లను అందుకున్నారు. శుక్రవారం కలెక్టర్ కె.ఎం.సరయు చెన్నైలో జరిగిన ఓటరు దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులను కలిశారు. జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, సబ్ కలెక్టర్ ప్రియాంక, కృష్ణగిరి దేవదాయ శాఖ కమిషనర్ ఎన్.షాజఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

హోసూరు జనవరి 31(ఆంధ్రజ్యోతి): హోసూరు రామ్‌నగర్‌లో స్వయంబుగా వెలసిన కోటమారియమ్మ ఆలయ ప్రవేశ గోపుర కుంభాభిషేకం వైభవంగా జరిగింది. 29న గణపతి పూజ, యాగశాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం రెండు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక యాగశాలల్లో పవిత్ర జలంతో కూడిన కలశాలకు పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య పవిత్ర జలంతో అమ్మవారికి కుంభాభిషేకం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.



కోటమారియమ్మ గోపురంపై కలశాలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్న పండితులు